క్లుప్తంగా

ఉపాధి పనుల తనిఖీ



నగరూరులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గీతావాణి

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఎంపీడీఓ గీతావాణి పరిశీలించి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. వలసలు వెళ్లకుండా సొంత గ్రామంలో ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కూలీలకు సూచించారు.

నీటి సమస్య పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

మద్దికెర: గ్రామంలోని గద్దం వీధి ఎల్లమ్మ దేవాలయం ప్రాంతంలో నీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు మంగళవారం పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలియజేశారు. కొళాయిలు ఉన్నా సక్రమంగా నీరు రావడం లేదని, నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అనంతరం ఈఓ శివకుమార్ మాట్లాడుతూ.. వాటర్ సిబ్బందితో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కొద్ది రోజులు పైపులు పగిలిపోవడంతో నీటి సమస్య తలెత్తిందని వాటిని సరిచేయడం జరిగిందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుత్ ఉద్యోగి మృతి



రామచంద్రారెడ్డి (ఫైల్)

మద్దికెర: మండల పరిధిలోని బొజ్జనాయునిపేట గ్రామానికి చెందిన విద్యుత్ ఉద్యోగి రామచంద్రారెడ్డి (50) గుండెపోటుతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో గుంతకల్లుకు తరలించగా కోలుకోలేక మరణించాడన్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ ఉమాపతితో పాటు సిబ్బంది గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యుత్ శాఖ డివిజన్ ఉద్యోగుల సంఘం, కార్మికులు సంఘం వారు మృతుడి భార్య సుజాతకు రూ.72 వేలు సాయం అందజేశారు. మృతుడికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏఈలు మహమ్మద్ రఫీక్, మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



ములుగుందంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఎస్టీయూ నాయకులు

ఆస్పరి: మండలంలోని ములుగుందం, కారుమంచి, కై రుప్పల, బిల్లేకల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థులకు మంగళవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్టీయూ నాయకులు నాగేంద్రప్ప, నాగరాజు, ఎల్లప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతికత వినియోగించుకోవాలి



రామదుర్గంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సునీత

చిప్పగిరి: మారుతున్న కాలానుగుణంగా వ్యసాయంలో సాంకేతికతను వినియోగించుకుంటూ మంచి ఫలితాలు సాధించాలని ఏడీఏ సునీత సూచించారు. ఆమె మంగళవారం మండలంలోని రామదుర్గం గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ఏఓ జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు పంటల సాగులో నూతన విధానాలు, ఆధునిక వ్యవసాయ పనిముట్లు, యంత్రాల వినియోగం, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రోహిణి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో తాతయ్య లాలుస్వామి ఉరుసు సందర్భంగా జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం గ్రామ పెద్దలు గుండాలయ్య, రాముడు, ప్రకాష్‌గౌడ్‌లు ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 55 జట్లు పాల్గొన్నట్లు వారు తెలిపారు. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందించనున్నట్లు వెల్లడించారు.

తారెత్తించిన ఆదోని సబ్ కలెక్టర్

- వీఆర్‌ఓలు, సిబ్బందిపై మండిపాటు
- కార్యాలయం బయటనే ప్రజల సమస్యలు తెలుసుకున్న సబ్ కలెక్టర్



హొళగుంద తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

హొళగుంద: స్థానిక తహసీల్దారు కార్యాలయానికి మంగళవారం తనిఖీ నిమిత్తం వచ్చిన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బందిని తారెత్తించారు. వివిధ పనుల కోసం వచ్చిన వారిని పలకరించి కార్యాలయంలో వెంటనే పని చేసి పెడుతున్నారా, అధికారులు ఎలా ఉన్నారు అని ఆరా తీయగా కొందరు పనులు జరగటం లేదని చెప్పడం, పలు ఫిర్యాదులు చేయడంతో ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన పెద్దహ్యాట గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. తర్వాత సమ్మతగేరి వద్ద ఉన్న ఎల్లార్తి మంచినీటి పథకాన్ని పరిశీలించి, నీటి నిల్వ, ఫిల్టర్‌బెడ్‌లో ఎంతమేర నీరు శుద్ధ మవుతాయి, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఏ విధమైన చర్యలు తీసుకుంటారు తదితర వాటి గురించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్‌లీలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఈ స్కీం పరిధిలోని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్కడి నుంచి హొళగుంద తహసీల్దారు కార్యాలయనికి వచ్చిన ఆయన బయట ఉన్న ప్రజలను పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'తన భార్య మంగమ్మ పేరిట పెద్దగోనెహాళ్ వ్యవసాయ పరిధిలో పదేళ్ల క్రితం మూడెకరాల భూమిని కొన్నానని, అప్పటినుంచి పట్టాదారు పాసుబుక్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని' వందవాగిలికి చెందిన బసేటి లక్ష్మన్న అనే రైతు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా మాటసుగురు ఈశ్వరప్ప మరి కొందరు తమ సమస్యలను ఆయనకు చెప్పుకున్నారు. అక్కడి నుంచి నేరుగా కార్యాలయంలోకి వెళ్లిన ఆయనకు వీఆర్‌ఓలందరూ కంట పడడంతో గ్రామాల్లో కాకుండా ఇక్కడేమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కంప్యూటర్ గదిని పరిశీలించారు. మధ్య దళారులు ఇక్కడే ఉంటున్నారని ఫిర్యాదులు వచ్చాయని, ఇతరులను లోపలకు అనుమతిస్తే చర్యలు తీసుకుంటానని సిబ్బందిని హెచ్చరించారు. కార్యాలయంలోని ప్రతి గదిని క్షుణంగా తిరిగిన ఆయన అనంతరం రికార్డులను పరిశీలించి వీఆర్‌ఓలు, ఇన్‌చార్జ్ తహసీల్దారు నిజాముద్దీన్‌తో మాట్లాడారు. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుని వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక



మాట్లాడుతున్న పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప

ఆలూరు రూరల్: పత్తికొండ, ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీలను గ్రోత్ సెంటర్లుగా మార్చి వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప చెప్పారు. ఆయన మంగళవారం ఆలూరు గ్రామ పంచాయతీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ రాజ్ కమిషనర్ అదేశాల మేరకు ఆలూరులో అభివృద్ధి వనరులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా స్థానిక ప్రకాశం పార్కు స్థలంలో ఒక షాపింగ్ కాంప్లెక్స్, గ్రోమోర్ సెంటర్‌పై ఒక ఫంక్షన్ హాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీకి చెందిన భాస్కర్ సత్రం భవనాన్ని కూల్చి రెండు అంతస్తులలో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక పాత బస్టాండులో ఉన్న షాపింగ్ కాంప్లెక్సు పైన రెండో అంతస్తు నిర్మాణానికి ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. వీటి నిర్వాణాలకు రూ.3 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశామన్నారు. కమిషనర్ నుంచి అనుమతులు రాగానే నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. భాస్కర్ సత్రంలో ఇప్పటి వరకు ఉన్న వ్యాపారస్తుల లీజు ఏప్రిల్ నెలతో ముగిసిందని, ఏడాది పాటు లీజును రెన్యూవల్ చేసి ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ ప్రకారం బాడుగ చెల్లించాలని సూచించామన్నారు. ఈఓ ప్రభాకర్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

జీఓ నంబర్ 21ను రద్దు చేయాలి



పత్తికొండలో ఆర్టీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పత్తికొండ రూరల్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన జీఓ నంబర్ 21ను వెంటనే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం పత్తికొండకు వచ్చిన ఆదోని రోడ్డు రవాణా శాఖ అధికారి ఆర్టీఓ నాగేంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు సెన్సార్ విధానాన్ని రద్దు చేసి ఫిట్‌నెస్, ఎఫ్‌సీలను పాత పద్ధతుల్లోనే చేయాలని కోరారు. ఆటోకార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సీఐటీయు, ఏఐటీయుసీ నాయకులు దస్తగిరి, రంగన్న, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు ఉన్నారు.

సూక్ష్మసేద్యంతో నీటి ఆదా



లక్కసాగరంలో తుంపర సేద్య పరికరాల పనితీరును పరిశీలిస్తున్న రాధాకృష్ణారెడ్డి

కృష్ణగిరి: సూక్ష్మసేద్యం ద్వారా నీరు ఆదా అవుతుందని జిల్లా సూక్ష్మ సేద్య పథక సహాయ సంచాలకులు రాధాకృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లక్కసాగరం గ్రామంలో 'సూక్ష్మ సేద్యం పథకం' ద్వారా రాయితీపై పరికరాలు పొందిన రైతులు సాగుచేసిన పొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. పరికరాల నాణ్యత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సూక్ష్మ సేద్యం ద్వారా నీటి ఆదాతోపాటు పంట దిగుబడి, నాణ్యత పెంచుకొనే అవకాశం ఉంటుందన్నారు. బిందు సేద్య పరికరాలను ఐదెకరాల్లోపు పొలం కలిగిన రైతులకు 90 శాతం, ఐదెకరాలకు పైగా పొలం కలిగిన రైతులకు 70 శాతం, అలాగే తుంపర పరికరాలను ఐదెకరాల్లోపు పొలం కలిగిన రైతులకు 55 శాతం, ఐదెకరాలకు పైగా పొలం ఉన్న రైతులకు 45 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 7 వేల హెక్టార్లకు ఈ పరికరాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 3,193 మంది రైతులకు సంబంధించి 3,016 హెక్టార్లకు అందించినట్లు చెప్పారు. త్వరలో లక్ష్యాన్ని చేరుకునేలా కృషి చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వివాదాస్పద స్థల పరిశీలన



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

కృష్ణగిరి: రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని పోతుగల్లు రెవెన్యూ పరిధిలోని వివాదాస్పద పొలాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన 1,065 సర్వే నంబర్‌కు సంబంధించి పొలాన్ని పరిశీలించి చుట్టుపక్కల రైతులతో మాట్లాడారు. ఈ పొలానికి సంబంధించి కొంత స్థలం ఆన్‌లైన్‌లో ఒకరి పేరిట ఉండగా, సాగులో మరొకరు ఉన్నారన్నారు. ఈ విషయంపై క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. ఇరువురు రైతులకు నోటీసులు ఇచ్చి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీఆర్వోలు రాజశేఖరరెడ్డి, అయ్యన్న ఉన్నారు.

'ఉపాధి'లో అక్రమాలకు పాల్పడితే చర్యలు



మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్

కృష్ణగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎంపీడీఓ మోహన్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను, హార్టికల్చర్ కింద సాగు చేసిన పండ్ల మొక్కలను ఆయన మంగళవారం పరిశీలించారు. పనికి వచ్చిన వారికి మాత్రమే మస్టర్లలో హాజరు వేయాలని సిబ్బందికి సూచించారు. అధికారులు సూచించిన మేరకు పని చేస్తే పూర్తి వేతనం అందుతుందని చెప్పారు. గ్రామంలో అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. ఈసీ మధు, టెక్నికల్ అసిస్టెంట్ ప్రతాప్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన



అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యులు

పత్తికొండ రూరల్: పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మంగళవారం వైద్యులు క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. అంతర్జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కల్పన అధ్యక్షతన జరిగిన సదస్సులో క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ ఆదినాగేష్, హారిక, ఇర్ఫాన్ బాషా, వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా క్యాన్సర్ వ్యాధి సోకుతుందన్నారు. తొలిదశలోనే గుర్తిస్తే కిమో, రేడియోథెరఫీ, ల్యాప్రోస్కోపిక్ అధునాతన పద్ధతులతో వ్యాధిని నయం చేసుకోవచ్చని వివరించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

హొళగుంద: 'లక్ష డప్పులు – వెయ్యి గొంతులు' పేరిట వర్గీకరణ ఆశయ సాధనకై పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 7వ తేదీన తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం హొళగుంద అంబేడ్కర్ విగ్రహం ముందు ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ భీమన్న ఆధ్వర్యంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



మద్దికెర: సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న రంగనాథస్వామి



ఆలూరు: జలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన శివమాలధారులు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని రంగనాథస్వామి దేవాలయంలో మంగళవారం రథసప్తమి పురస్కరించుకొని శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రదక్షిణలు చేసి బిందెసేవ, అష్టోత్తరనామార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కళ్యాణమండపంలో కొలువుతీరిన స్వామివార్లకు వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తాదుల మధ్య కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం రథసప్తమి కొరకు ప్రత్యేకంగా తయారుచేయించిన సూర్యప్రభ వాహన పల్లకీలో గ్రామ పురవీధులు గుండా స్వామివారిని ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈఓ వీరయ్య,రామలింగారెడ్డి పాల్గొన్నారు.




ఆస్పరి: గాయత్రీ మాతను తాకిన సూర్య కిరణాలు

ఆస్పరి: ఆస్పరి సమీపంలో వెలసిన రామలింగేశ్వర స్వామి, గాయత్రీ మాత ఆలయాలలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం గాయత్రీ మాత విగ్రహానికి సూర్యకిరణాలు తాకాయి. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శివ దీక్షాస్వాములు రామతీర్థం కొలనులో స్నానం చేసి సూర్య భగవానుడిని దర్శించుకున్నారు.

సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు



హొళగుందలోని సిద్ధేశ్వరస్వామి ఆలయం



గుహలో వెలిసిన శ్రీసిద్ధేశ్వరస్వామి విరాట్‌మూర్తి

హొళగుంద: మండల కేంద్రంలో కొలిచే వారికి కొంగు బంగారంగా వెలుగొందుతున్న 'సిద్ధేశ్వరస్వామి' జాతర ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. స్థానికులతో పాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తుల ఆరాధ్య దేవుడిగా విరాజిల్లుతున్న సిద్ధేశ్వరస్వామి జాతరలో భాగంగా ఈ నెల 2న కంకణధారణతో ఉత్సవాలకు నాంది పడింది. ఈ ఉత్సవాలకు మండలంలోని చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం, ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి రానుండటంతో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఉత్సవ వివరాలు

ఈ నెల 5న నంది ఉత్సవం, 6న గజోత్సవం, 7న రాత్రి రథోత్సవం, 8న లంకాదహనం, 9న వసంతోత్సవ కార్యక్రమాలతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, శివన్నగౌడ, సిద్దార్థగౌడ్ తెలిపారు. జాతర సందర్భంగా సిద్దేశ్వర స్వామి అభివృద్ధి సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. గ్రామీణ పిల్లలతో పాటు పెద్దల కోలాటాలు ఇతర ఆటపాటలతో పాటు బల ప్రదర్శన కార్యక్రమాలు భక్తులను అలరించనున్నాయి. 8న గడినాడ కన్నడ కళా యువ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కళాకారులతో 'కుడుక కట్టిద తాళి' అనే కన్నడ సామాజిక నాటకాన్ని ప్రదర్శించనున్నారు.

- 8న లంకాదహనం రోజున రూ.లక్షలు ఖర్చు పెట్టి వివిధ రకాల బాణాసంచా పేల్చుతారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి అన్ని వర్గాల ప్రజలు తరలివస్తారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ వెంకటచలపతి ఆధ్వర్యంలో హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు, నియోజకవర్గంలోని ఆయా మండలాల ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.

చురుగ్గా ఏర్పాట్లు



రెండు రోజులు ఉత్సావాలతో పాటు 7వ తేది నుంచి 9వ తేదీ వరకు జరిగే జాతరకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. లంకాదహనం కార్యక్రమానికి బాణాసంచా సిద్ధమవుతోంది. రథోత్సవం, లంకాదహన కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేసాం. అలాగే భక్తులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పిస్తాం.

– రాజ పంపన్నగౌడ్, ఆలయ ధర్మకర్త

మండల సమావేశం నేటికి వాయిదా

తుగ్గలి: కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే మధ్యాహ్నం 12.30 గంటలవరకు ఎదురుచూసినా కోరంకు సరిపడా ఎంపీటీసీ సభ్యులు హాజరు కాలేదు. ఇన్‌చార్జ్ ఎంపీపీతో పాటు, ఉప్పర్లపల్లి, రామాపురం ఎంపీటీసీ సభ్యులు వనమాల పుష్పావతి, రామదాస్ నాయక్ మాత్రమే హాజరయ్యారు. 14మంది సభ్యులు గైర్హాజరు కావడంతో సమావేశాన్ని బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు.

కందుల కొనుగోలు కేంద్రం పరిశీలన



కందుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మార్క్ ఫెడ్ అధికారులు

మద్దికెర: రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకున్న ప్రతి రైతు నుంచి కందులు కొనుగోలు చేస్తామని మార్క్ ఫెడ్ డీసీఎం రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద కందుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కందులను ప్రభుత్వం రూ.7550 మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీటీసీ రామకృష్ణ, రైతులు కృష్ణ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మధుయాదవ్‌కు మాతృ వియోగం



సావిత్రమ్మ (ఫైల్)

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు మధుయాదవ్ మాతృమూర్తి సావిత్రమ్మ (65) అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని ఆమె స్వగృహంలో మంగళవారం మృతి చెందారు. ఆమెకు భర్త, కూతురు, కుమారుడు ఉన్నారు. సావిత్రమ్మ మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలి

ఆలూరు: యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎల్.ఆనందరాజ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా కార్యాక్రమం నిర్వహించారు. సన్‌కిషన్ అగ్రి అండ్ కో, క్రెడిట్ యాక్సిస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఏరియా స్కిల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ వీరేష్, స్కిల్ ట్రైనర్ మన్సూర్ అలీ పాల్గొన్నారు. జాబ్‌మేళాలో 71 మందికిగాను 36 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు.

బకాయిల వసూళ్లపై నిర్లక్ష్యం తగదు



విద్యుత్ సిబ్బందితో సమావేశమైన డీఈ హరి

ఆలూరు: ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల విద్యుత్ వినియోగదారుల నుంచి పెండింగ్ బకాయిలను వసూలు చేయడంలో నిర్లక్ష్యం తగదని ఆదోని డివిజన్ విద్యుత్ శాఖ డీఈ హరి సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ఏడీఈ కార్యాలయం ఆవరణలో ఏడీఈ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఏఈ, ఎల్ఐ, జేఎల్ఎం, బిల్ కలెక్టర్లు, తదితరులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. డీఈ హరి మాట్లాడుతూ.. సిబ్బంది నిర్లక్ష్యం వీడి పనిచేయాలన్నారు. విద్యుత్ బిల్లులను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. లోఓల్టేజీ ఉన్న గ్రామాలలో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఏఈలు, ఎల్ఐ, జేఎంలు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి వంకలో పనుల నిలిపివేత

వెల్దుర్తి: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల మైదానాన్ని ఆనుకుని ఉన్న వంకలో పాఠశాల వారు చేపట్టిన మైదానం పొడిగింపు పనులను మైనర్ ఇరిగేషన్ ఏఈ రవినాయక్ మంగళవారం అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా పనులు చేపట్టడంతో నిలిపివేసినట్లు ఏఈ తెలిపారు. బాలికలు ఆడుకునేందుకు సరిపడా క్రీడా మైదానం లేకపోవడంతో వంక వైపు పొడిగింపు పనులను చేపట్టినట్లు హెచ్ఎం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజేశ్ చెప్పడంతో సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకున్న తర్వాత పనులు చేపట్టాలని సూచించారు.

సీపీఐ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

హొళగుంద: సీపీఐ కార్యాలయం కోసం స్థలం కేటాయించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పెద్యాట మారెప్ప ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం హొళగుందకు వచ్చిన సబ్ కలెక్టర్‌ను కలిసిన వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి రంగన్న, రైతు సంఘం నాయకులు కృష్ణ తదితరులు ఉన్నారు.

ఏపీ ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ



ఏపీ ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణలో నాయకులు

వెల్దుర్తి: మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో మంగళవారం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్ మాదిగ ఆధ్వర్యంలో సమితి గ్రామ యువసేన ఏర్పాటు జరిగింది. ముందుగా ఆయన ఏపీ ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. దళితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారన్నా, ఎస్సీ వర్గీకరణ ఒక కొలిక్కి వచ్చిందన్నా అది మాదిగల పోరాటం, సమితి ఉద్యమ ఫలితమేనన్నారు. ఉద్యమాల్లో అసువులు బాసిన వారిని స్మరించుకుంటూ దళిత వాడల్లో ఏపీ ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేస్తోందన్నారు. హక్కుల సాధనకు మరింత పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు. ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల నాయకులు దానియేలు, పుల్లయ్య, కేశన్న తదితరులు పాల్గొన్నారు.